# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**SEPTEMBER - 2014**

సంవత్సర చందా రూ. 50/-

# బైబిలు లెక్చరర్‌షిప్
(BIBLE LECTURESHIP)

స్థలము : సత్యవాణి - క్రీస్తు సంఘము
7-9-35, సాంబమూర్తి వీధి,
కుళాయిచెర్వు ఎదురుగా,
రామారావు పేట, కాకినాడ - 533 004

సమయం : 2014 నవంబరు, 11 నుండి 14 వరకు
ప్రతిరోజు ఉదయం 10 గంటలకు
ప్రారంభమగును

ప్రసంగీకులు : అనుభవజ్ఞులైన స్వదేశ విదేశ సహోదరలు
ఉపన్యసించెదరు.

భోజన వసతి ఉచితం, మొదట్లో 20/- రూ॥లు రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రము కట్టవలెను. ఆ కూటములకు హాజరగుటకు సిద్ధపడండి. ప్రార్థించండి, తప్పక రండి.

వందనములతో
జాషువా గూటం
రిక్కీ గూటం
రోని గూటం

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 34 | సెప్టెంబరు - 2014 | సంచిక -2


## నిత్యజీవిత తృష్ణ

### (When Christ Comes again)

బైబిలు బోధించు దానినంతటి సారాంశమును మనము మూడు మాటలలో క్లుప్తముగ చెప్పుకొనవచ్చును. క్రీస్తు రాబోవుచున్నాడు, క్రీస్తు వచ్చెను, క్రీస్తు మరల రాబోవుచున్నాడు. క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి క్రొత్త నిబంధన యంతటిలోను గొప్ప ప్రాముఖ్యత ఈయబడియుండుట మనము చూడగలము. క్రీస్తు ఇదిగో ఇప్పుడు వచ్చుచున్నాడు. అదిగో అప్పుడు వచ్చుచున్నాడని జోస్యము చెప్పువారు మనమధ్య అనేకులుండుట వలన ఈ యంశము పై సత్యమును తెలుసుకొను నిమిత్తము అపొస్తలులు ఏమి బోధించిరో గమనించుట అత్యవసరము.

క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి మన మెప్పుడు చెప్పుకొనినను ఆయన మొదట ఒకసారి వచ్చెనను సత్యము అందులో ఇమిడియున్నది. "కాలము పరిపూర్ణమైనపుడు దేవుడు తన కుమారుని పంపెను" అని గలతీ 4:4లో వ్రాయబడియున్నది. యేసుక్రీస్తు

ఒకసారి ఈలోకమునకు వచ్చుట మాత్రమే గాక ఆయన మరల వత్తునని అనేకసార్లు బోధించెను. "నాయందు విశ్వాసముంచుడి, నాతండ్రియింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసుకొని పోవుదును" అని ఆయన బోధించెను (యోహాను 14:1-3).

క్రీస్తు మరల వచ్చునని గత 20 శతాబ్ధములలో యున్న క్రైస్తవులందరు ఎదురు చూచుచునే యున్నారు. అయితే ఆయన ఎప్పుడు రాబోవుచున్నాడు? ఆయన రాకడ ఎప్పుడో మనము ఏమైనను తెలిసికొనగలమా? ఆయన రాకడ ఎప్పుడో నిజానికి యేమానవుడును ఎరుగడు. అది దేవునికి ఒక్కనికి మాత్రమే తెలియును. అందుకే "ఆదినమును గూర్చియు ఆగడియను గూర్చియు తండ్రి తప్ప ఏమనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు, జాగ్రత్తపడుడి; మెలకువగా నుండి ప్రార్థన చేయుడి; ఆకాలమెప్పుడు వచ్చునో మీకు తెలియదు" అని యేసు బోధించెను (మార్కు 13:32, 33).

అయితే క్రీస్తు మరల రాక ముందు కొన్ని సంగతులు జరుగవలసి యున్నవి. యూదులు, అన్యులు కూడ క్రీస్తు సంఘములో చేర్చబడుట జరుగవలసి యున్నది. అన్యులు కూడా సంఘములో చేర్చబడుటను గూర్చి ఆయన "ఈదొడ్డివి కాని వేరే గొర్రెలు నాకు కలవు; వాటిని కూడ నేను తోడుకొని రావలెను; అవి నాస్వరము వినును, అప్పుడు మంద ఒక్కటియు గొర్రెలకాపరి ఒక్కడును అగును" అని చెప్పెను (యోహాను 10:16). ఈసంగతి మొదటి శతాబ్దములోనే నెరవేరెనను సంగతి మనమందరము ఎరిగినదే. క్రీస్తు మరల రాకముందు ఆయనను గూర్చిన సువార్త ఈలోక మందంతట చాటించబడ వలసి యున్నది: "మరియు ఈరాజ్య సువార్త సకలజనములకు సాక్ష్యార్థమై లోకమం దంతటను ప్రకటింపబడును; అటు తరువాత అంతము వచ్చును" అని యేసు పలికెను (మత్తయి 24:14). ఈనాడు క్రీస్తు సువార్త మరెన్నడు లేనంత ఎక్కువగా చాటించబడుచు

న్నది. సువార్త పత్రికలద్వారా, ముద్రింపబడిన పుస్తకముల ద్వారా, బహిరంగ సభల ద్వారా, రేడియో, టెలివిజనుల ద్వారా ఈనాడు భూనలుమూలలా క్రీస్తును గూర్చి చాటించబడుచున్నది. అంటే క్రీస్తు యొక్క రెండవ రాకడ అతిసమీపముగ నున్నది యని మనము గ్రహించుకొన గలము.

క్రీస్తు రాకముందు జరుగవలసిన మరొకసంగతి యేమంటే – సంఘము విశ్వాస భ్రష్టత్వములో పడి, నాశన పాత్రుడగు పాపపు పురుషుడు బయలు పరచబడవలసి యున్నది. ఇందు విషయమై అపొ.పౌలు ఇట్లు వ్రాసెను: "సహోదరులారా, ప్రభువు దినమిప్పుడే వచ్చియున్నట్టుగా ఆత్మవల్లనైనను, మాటవల్లనైనను మాయొద్దనుండి వచ్చినదని చెప్పిన పత్రిక వల్లనైనను ఎవడైనను చెప్పిన యెడల, మీరు త్వరపడి చంచల మనస్కులు కాకుండ వలెననియు, బెదరకుండ వలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడను బట్టియు మనము ఆయన యొద్ద కూడుకొనుటను బట్టియు మిమ్మును వేడుకొనుచున్నాము. మొదట భ్రష్టత్వమును సంభవించి నాశన పాత్రుడగు పాప పురుషుడు బయలు పడితేనేగాని ఆ దినము రాదు. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో దానినంతటిని ఎదిరించుచు దానికంతటికి పైగా వాడు తన్ను తానే హెచ్చించుకొనుచు తానే దేవుడనని తన్ను కనుపరచుకొనుచు దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఎవడును మిమ్మును మోస పరచనియ్యకుడి (2 థెస్స 2:1–4).

పరిశుద్ధాత్ముడు చెప్పిన ఈసంగతి కూడ నెరవేరియున్నది. క్రీస్తు సంఘమ్ము 6వ శతాబ్దమునాటికి సంపూర్ణముగ విశ్వాస భ్రష్టురాలాయెను. క్రీ॥శ॥ 606 లో మొట్ట మొదటి పోపుగా Boniface III అనునతడు బయల్వెడలెను. ఇతడు భూమిపై క్రీస్తు యొక్క ఏకైక ప్రతినిధియనియు (Vicar of Christ), పరిశుద్ధ తండ్రియనియు (Holy Father), సార్వజనిక సంఘ శిరస్సనియు బిరుదులను ధరించెను. నాటి నుండి నేటి వరకు ఈ పోపుల సాంప్రదాయము మనమధ్య ఉండే యున్నది. అయితే క్రీస్తు ఏమానవుని భూమిపై తన ప్రతినిధిగా ఏర్పరచు

కొనలేదనియు, దేవుడొక్కడే మన పరిశుద్ధ తండ్రియనియు, సంఘమునకు శిరస్సు క్రీస్తే అనియు బైబిలు విశదముగ బోధించుచున్నందున నాశన పాత్రుడగు పాపపు పురుషుడెవడో మనము ఇట్టే గమనించుకొనగలము గదా.

క్రీస్తు ఇప్పుడు మరెల్లప్పుడు కూడ సర్వాధికారాన్ని కలిగియున్నారు. ఆయధికారమును ఆయన మృతతుల్యులైన మానవులతో పంచుకొనుటలేదు: "పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారమీయబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్తజనులను శిష్యులనుగా చేయుడి..... ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని" యేసు చెప్పెను (మత్తయి 28:18-20). యుగసమాప్తి వరకు, సదాకాలము సర్వాధికారాన్ని యేసే కలిగి ఆయన మనతో ఉన్న యెడల ఆయన ప్రతినిధి యొక్క అవసరమే మనకు లేదని గ్రహించుదము.

మరల ఆత్మీయ విషయల్లో మనకు దేవుడు తప్ప తండ్రియైనవాడు మానవుడును లేడని యేసు బోధిం "మరియు భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీతండ్రి; ఆయన పరలోకమందున్నాడు" అని ఆయన బోధించెను (మత్త 23:9). ఈరోజుల్లో క్రైస్తవ మతగురువులను Father అని పిలిచే అలవాటు, అట్లు పిలిపించుకొనే అలవాటు అనేకులు కలిగియున్నారు. అట్టివారు దేవునినే యెదిరించువారై యుండి నాశన పాత్రుడగు పాపపు పురుషుని ఆత్మను కలిగియున్నారని గమనించుదము.

క్రీస్తు యొక్క సంఘమునకు భూలోకములో శిరస్సుగా ఏమానవుడును లేడని క్రొత్తనిబంధన బోధించుచున్నది. "ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే సమస్తమునకు ఆధారభూతుడు, సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగునిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో అదిసంభూతుడాయెను" అని కొలస్స 1:18 చెప్పుచున్నది. సంఘమునకు రెండు శిరస్సులు లేవు. సంఘమునకు శిరస్సుగా ఏ మానవుడయినను తన్ను

తాను నియమించుకొనిన యెడల అతడు దేవుని ఆలయములో దేవుని స్థానమునే ఆక్రమించుకొనిన ధర్మ విరోధియని మనము గ్రహించుదము.

యేసుక్రీస్తు మరల రాకముందు ఇట్టి సంగతులు జరుగునని పరిశుద్ధాత్ముడు ముందుగానే మనలను హెచ్చరించెను. గనుక నిజక్రైస్తవులు మరింత జాగరూకత కలిగి యుండవలెను. "కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును, దయ్యముల బోధ యందును లక్ష్యముంచి, విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మ తేటగా చెప్పుచున్నాడు" (1 తిమో 4:1). నేటి క్రైస్తవ లోకమును ఒక్కసారి పరిశీలించిన యెడల ఈమాట సత్యమని మనము ఒప్పుకొనక తప్పదు. అందు వలన క్రీస్తు యొక్క రెండవరాకడ కొరకు ఈలోకము పరిపక్వమై యున్నదని గమనించుదము. ఆయన రాకడకు ముందు జరుగవలసిన సంగతులన్నియు జరిగియున్నవని మనము గమనించాము. గనుక ఆయన రాకడ ఎప్పుడైనను సంభవించునని యెరిగి అతి జాగరూకతతో మనముండవలెను.

ఆయన రాకడ దొంగవచ్చిన యట్లుండును: "ఏజామున దొంగ వచ్చునో యింటి యజమానికి తెలిసి యుండిన యెడల అతడు మెలకువగా ఉండి తన యింటికి కన్నము వేయనియ్యడని మీరెరుగుదురు. మీరనుకొనని గడియలో మనుష్య కుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా యుండుడి" అని యేసు బోధించెను (మత్తయి 25:43-44). ఆయన అకస్మాత్తుగా వచ్చును. మనమను కొనని సమయమందు ఆయన వచ్చును. ఆయన వచ్చుట తథ్యము నీవు సిద్ధముగా యున్నావా? లేని యెడల ఈనాడే క్రీస్తును ధరించుకొని ఆయన రాకకై ఎదురు చూడుము. క్రీస్తునందు విశ్వాసముంచుము, పాపముల విషయమై మారు మనస్సు నొందుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ఆయన రాకకై మిగిలిన క్రైస్తవులతో కలిసి ఆశతో ఆపేక్షించుము.

వచ్చే సంచికలో క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి మరికొన్ని సత్యములను దైవవేదము నుండి తెలుసుకొందము.

# తప్పిపోయిన గొర్రె
## (The Lost Sheep)

లూకా 15:1-7 - లూయిస్ రాస్‌మోర్

**పరిచయము :**

తప్పిపోయిన గొర్రెను గూర్చిన ఉపమానము లూకా సువార్తలో ప్రత్యేకమైనది. దానిలాంటి మరొక సందర్భము మత్తయి సువార్తలో కూడ కనబడును. గొర్రెలు, గొర్రెల కాపరుల ఉదాహరణలతో బైబిలులో అనేక సత్యములు బోధింపబడినవి.

మనలో చాలమందికి ఇష్టమైన లేఖన భాగములుంటాయి. లూకా సువార్త 15 అధ్యాయము అనేకులకు ఇష్టపూర్వకమైనది. అది బైబిలు అంతటిలోను అత్యంత అమూల్యమైనది. దానియంతటి మృదువైన ప్రేమ పూర్వకమైన అధ్యాయము మరొకటిలేదు. అది సువార్తలకు సువార్తయని శతాబ్దములు తరబడి చెప్పబడుచున్నది. ఆ అధ్యాయములో మూడు గొప్ప ఉపమానములు చెప్పబడినవి; తప్పి పోయిన గొర్రె, పడిపోయిన నాణెము, తప్పిపోయిన కుమారుడు. అదిమూడు ఉపమానములుగా యున్నను లూకా 15వ అధ్యా యము అంతయును ఒకే ఉపమానమై యున్నది. ఒక ఉపమానము మరొక దానికి నడిపించును. "అందుకాయన వారితో ఈ ఉపమానము చెప్పెను" అని లూకా 15:3లో చెప్పబడినది. అనగా ఆ అధ్యాయమంతయు ఒకే ఉపమానమై యున్నది.

అందున్న మూడు ఉపమానములు కూడ ఒక్క ఆత్మ నశించి పోతే దేవుడు గమనిస్తారు. బహుశా దు:ఖిస్తారు. పాపుల యెడల దేవుని ప్రేమను ఈ ఉపమానములు తెలియజేయుచున్నవి. గొర్రె, నాణెము, కుమారుడు... విలువ పెరుగుచు యున్నది.

నూరులో ఒకటి, పదిలో ఒకటి నుండి ఇద్దరిలో ఒకని దగ్గరకు మనం వస్తాము. గొర్రెను పోగొట్టుకంటే తీవ్రమే, డబ్బును పోగొట్టుకొంటే ఇంకా ఘోరము, కుమారునే పొగొట్టుకొంటే అన్నిటికంటే ఘోరము. ఇవన్నీ కలిసి ఆయనను విమర్శించే వారికి యేసు యిచ్చిన జవాబు అయ్యున్నది (లూకా 15:2). శాస్త్రులు, పరిసయ్యులు యేసు సుంకరులతోను పాపులతోను సహవాసము చేయుచున్నాడని తరుచు విమర్షించే వారు. వారు పరలోక రాజ్యము విషయమై అనాసక్తిపరులు. సుంకరులను తమ స్వదేశస్థులే ద్వేషించేవారు. వారు రోమా ప్రభుత్వము దరపున యుండేవారు గనుక దేశద్రోహులుగా పరిగణించేవారు.

యేసును స్వాగతించ వలసిన నాటి మతనాయకులే ఆయనను తిరస్కరించారు. అది విచారం. అయితే

పాపులైన వారు యేసును సంతోషంతో వెదికేవారు, వెంబడించేవారు. పరిసయ్యులవలెగాక పాపులు తాము పాపులని, వారికి రక్షణ అవుసరమని గ్రహించేవారు.

**ఉపమానము:**

"అందుకాయన వారితో ఈ ఉపమానము చెప్పెను. మీలో ఏ మనుష్యునికైనను నూరుగొర్రెలు కలిగి యుండగా వాటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి తప్పిపోయినది దొరుకువరకు దానిని వెదక వెళ్లడా? అది దొరికినప్పుడు సంతోషముతో దానిని తన భుజముల మీదవేసి కొని ఇంటికివచ్చి తన తన స్నేహితులను పొరుగువారిని పిలిచి మీరు నాతో కూడ సంతోషించుడి, తప్పిపోయిన నా గొర్రెదొకిరినదని వారితో చెప్పును గదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటే మారుమనస్సు పొందు ఒక్కపాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా 15:3-7).

గొర్రెలు గొర్రెలు కాపరులు పాలస్తీనాలో సామాన్యమే. అందువలన వీరిని గూర్చిన సందర్భములు లేఖనములలో తరుచు మనకు కనబడ్తాయి. వాటిని ఉదాహరణగా వినియోగించిన సందర్భములు కూడా మెండు. గొర్రెలను గూర్చి మొదటిగా ఆదికాండము 4:2లో కనబడతాది. హేబెలు గొర్రెల కాపరి. గొర్రెలు, గొర్రెపిల్లలు బలి అర్పణగా అర్పించబడినట్లు పాత నిబంధనలో మనము కనుగొనగలము (నిర్గమ 20:24; 1 రాజులు 8:63; 2 దినవృ 29:33). గొర్రెలు మాంసాహారమునకు ముఖ్యము (1 సమూ 28:18; 1 రాజులు 1:19; 4:23; కీర్త 64:11). వాటిపాలు త్రాగుటకును, (యెష 7:21,23) ఉన్ని దుస్తులకును ఉపయోగపడేవి (లేవి 18:47; ద్వితీ 22:11).

గొర్రెల కాపరియొక్క విధులు అనేకములు. వారికి నిత్యము వుండే విధులు కలవు. అతని జీవితము ఎల్ల వేళలా శక్తివంతముగాను, చురుకుగాను వుండేది. గొర్రెలు పుట్టిననాటి నుండి చనిపోయే వరకు వాటిని పాలించుట అత్యవుసరము. అవి వినయముకు, సాత్వికముకు, ఓర్పుకు, మృదుత్వమునకు గురుతుగా యున్నను (యెషయా 53:7; అపొ.కా. 8:37), అవి అతి తెలివి తక్కువ జంతువులు. వాటిని నిత్యము చూచుచు, కాయుచుండుట అత్యవుసరము.

బైబిలు కాలములో యూదయలో గొర్రెలకాపరి యొక్క పనిచాల కష్ట తరమైనది అరుదైన పచ్చిక ప్రదేశములు కనుగొనుట, మందను కాయుట కష్టమైనపని, గొర్రెలకాపరి వేడికి, చలికి తట్టుకోవాలి (ఆదికా 31:40). ప్రకృతి సహజమైన ఆహారము సేవించాలి (ఆమోసు 7:14). క్రూరమృగముల నుండి తన

మందను కాయాలి (1 సమూ 17:34; యెషయా 31:4; యిర్మీ 5:6; ఆమోసు 3:12). దొంగలనుండి కూడ మందను అతడు కాపాడాలి (ఆది 31:39).

గొర్రెల కాపరుల విధులు కూడ లేఖనములలో మనకు చెప్పబడినవి. ఉదయాన్నే అతడు మందను దొడ్డి లోనుండి బయటికి తీసుకొనివెళ్లాలి. కుక్కలతో అతడు మందను కాపలా కాసేవాడు (యోబు 30:11). కొన్ని తప్పిపోయిన యెడల అవి దొరికే వరకు వాటిని వెదకాలి (యెహెజ్కేలు 34:12; లూకా 15:4), అతడు గొర్రెలకు నీటిని సరఫరా చేయాలి (ఆదికా 29:7; కీర్తన 23:2; ఆదికా 30:38, నిర్గమ 2:16). సాయంకాలమున గొర్రెలను అతడు దొడ్డిలోనికి చేర్చాలి (లేవి 27:32; యెహెజ్కేలు 20:37; యిర్మీ 33:13), రాత్రులందు వాటికి కాపలా కాయాలి (యెహాను 10:3; ఆదికా 31:40).

గొర్రె తెలివి తక్కువ గల జంతువు. అది అక్కడా ఇక్కడా తిరుగును. ఎక్కడ ఖాళీ దొరికితే అక్కడికి పోయే జంతువు అది. అది దూరపు కొండలలోనికి పోయి దారి తప్పిపోవును. తప్పిపోయినట్లుదానికి తెలియదు. వేలకొలది ప్రజలు నేడు ఇట్లున్నారు.

మేత మేయుచు గొర్రెలు దారి తప్పిపోవుట కద్దు. దారితప్పిపోవాలని అవి తలంచవు, గాని తిరిగివచ్చే దారి వాటికి తెలియదు. మానవులు పాపములో అటుయిటు తిరుగుచు దేవునినుండి తొలగిపోవుదురు (యెషయా 59:1,2). మంచి గొర్రెలకాపరియైన యేసు స్వరమును విననందున నేడు అనేకులు నాశనమగుచున్నారు (యెహాను 10:14, 27).

"నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెను" (లూకా 19:10). "నేను పాపులను పిలువ వచ్చితిని గాని నీతి మంతులను పిలువ రాలేదు" (మత్త 9:13). యేసును వ్యతిరేకించిన మత నాయకులు దీనిని గుర్తించి ఆయనను స్వీకరించి యుండవలసినది. అప్పు డాయన పాపులతో సాంగత్యము చేయు కారణమును గ్రహించి యుందురు.

నశించిన గొర్రెను వెదకి పట్టు కొందునని కాపరి ఎల్లప్పుడు తలం చును. దానిని ఎప్పుడు కనుగొనలేనని అతడు తలంచడు. దానిని వెదుకుటకు కాపరి తానే వెళ్లును గనుక అతనీ ఆసక్తిని మనము గ్రహించుకొందుము. నశిం చిన దానిని వెదకి కనుగొనిన తరువాత కాపరి దానిన శిక్షించడు, కఠినంగా దానిని దొడ్డిలోనికి చేర్చడు గాని దానిని తన భుజముల మీద వేసికొని దొడ్డి లోనికి దానిని చేర్చును.

లూకా 15:6లో చెప్పబడిన సంతోషము, ఒక్క పాపి మారుమనస్సు పొందితే పరలోకములో కలుగు నిజ మైన సంతోషమును వర్ణించుచున్నది. అదే రీతిగా మనతోటి మానవులు

మారుమనస్సు పొందినప్పుడు మనము కూడ నిజముగా సంతోషించాలి.

పరిసయ్యులు, శాస్త్రులు నీతి మంతులని, సుంకరులు పాపులని యేసు యొక్క ఉద్దేశ్యము కాదు. సరిగదా మారుమనస్సు అక్కడ లేని వారెవరు లేరని, అందరు అంతట మారుమనస్సు పొందవ లెనని ఆయన ఉద్దేశ్యము. వారు నీతిమం తులమని చూపించుకొనే వారు, ఆరోపిం చుకొనే వారు గాని వారు నీతి మంతులు కాదు. తమస్వనీతిని బట్టి యేసును వారు నిందించుటను బట్టి ఆయన వారిని ఖండించారు. తొంబది తొమ్మిది స్వనీతి పరుల కంటె మారు మనస్సు పొందు సుంకరులు, పాపుల విషయమై పరలోక మందు నిజమైన సంతోషము కలుగును. నశించుట ఘోరము, రక్షింపబడుట సంతోష దాయకము.

**ముగింపు :**

మానవుల యెడల దేవుని ప్రేమ తరుచు గొర్రెలతో పోల్చబడినది (మత్త 9:36; 10:6; హెబ్రీ 13:20; 1 పేతు 2:25). తప్పిపోయిన గొర్రెలవలె తరుచు దేవుని ప్రజలు వర్ణించబడ్డారు (కీర్త 119:76; యెష 53:6; యిర్మి 23:1-2; జెక 13:7). ఇశ్రాయేలీయుల నాయకులు తమ బాధ్యతను విస్మరించినందున దేవుడు వారిని శిక్షించుచు వచ్చారు. బాధ్యతను విస్మరించినందున దేవుడు వారిని శిక్షించు నిమిత్తము దేవుడు వారికొక గొర్రెల కాపరిని వాగ్దానము చేసారు. ఆయన ద్వారా తప్పిపోయిన గొర్రెలను ఆయన తిరిగి సంపాదించు కొనుచు (యెహెజ్కేలు 34). ఇశ్రాయేలీయుల నాయకులు ఎల్లప్పుడు చేయవలసిన పనిని చేయుటకు యేసు వచ్చారు. నశించిన దానిని వెదకి రక్షించుటకు ఆయన వచ్చారు (లూకా 19:10). మనము పాపములోబడి తప్పి పోయినను దేవుడు మనలను గూర్చి చింతించుచున్నారని తప్పిపోయిన గొర్రె ఉపమానము తెలియజేయుచున్నది.

గొర్రెల కావరి తప్పిపోయిన గొర్రెలను గూర్చిన దేవుని చింత ఈ ఉపమానము తెలియజేయుచున్నది. పాపులను గూర్చి చింతించుట వేరు, వారిని వెదుక వెళ్లుట వేరు. దేవుడు నశించినవారిని వెదుకును. ఆయన ఆవ్యక్తిని ప్రేమించును. అశ్రద్ధవలన ప్రజలు దేవుని నుండి తొలగి పోతారు.

యేసు తానే గొర్రెల కాపరిగా గుర్తించు కొన్నారు (యోహాను 10:11, 14-15). యేసు ప్రధానకాపరి యని పేతురు గుర్తించాడు (1 పేతురు 5:4). తదుపరి సంఘ పెద్దలు మందను కాయు వారని కూడ చెప్పబడినది (అపొ.కా. 20:28-29, 1 పేతురు 5:2-3).

మన ప్రధాన కాపరియైన యేసు ప్రభువు యూదులను అన్యజనులను ఒకేమందగా చేర్చారు. యేసుక్రీస్తు వధింప బడిన గొర్రె పిల్లగా కూడ లేఖనములలో వర్ణించబడ్డారు (యోహాను 1:29; 36:1, 1 పేతురు 1:18-19; యెష 53:7). ఆయన దేవుని గొర్రెపిల్లగా ప్రకటన గ్రంథములో 79 సార్లు చెప్పబడినది.

## క్రీస్తు బోధ అనగానేమి?
## (What is the Doctrine of Christ?)

క్రీస్తుబోధ అనగా ప్రభువు బోధించిన సత్యవాక్య సూత్రములు అని సామాన్యముగా చెప్పవచ్చును. "క్రీస్తు బోధయందు నిలిచి యుండక దానిని విడిచి ముందుకు సాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు." (2 యోహాను 1:9). క్రీస్తు బోధ అనగా క్రీస్తు ఉపదేశించిన సత్యము అని అర్థము. క్రీస్తు బోధించినది దేవుని బోధ, "అందుకు యేసు నేనే చేయు బోధ నాదికాదు; నన్ను పంపినవానిదే. ఎవడైనను ఆయనచిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనినయెడల, ఆ బోధ దేవుని వలన కలిగినదో, లేక నాయంతట నేనే బోధించుచున్నానో, వాడు తెలిసికొనును." (యోహాను 7:16-17).

యేసుక్రీస్తు ఈలోకంలో ఉండగానే తన శిష్యులకు సువార్త సత్యమును బోధించారు. ఆయన శిష్యులబోధ తనబోధ అని కూడా ప్రకటించారు. యోహాను 16:13లో "అయితే ఆయన అనగా సత్య స్వరూపి యైన ఆత్మ వచ్చినపుడు మిమ్మును సర్వ సత్యములోనికి నడిపించును; ఆయన తనంతట తానే ఏమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును గనుక నన్ను మహిమపరచును."

దేవుడు - క్రీస్తు - పరిశుద్ధాత్ముడు - అపోస్తులులు.

ఈక్రమపద్ధతిలో దేవుడు తన వాక్యము, సత్యము బోధ అపోస్తులుల ద్వారా క్రొత్తనిబంధన రచించి ఇచ్చారు. క్రీస్తుబోధ = క్రొత్త నిబంధన బోధ, క్రీస్తుబోధను అపోస్తులులు పెంతెకోస్తు పండుగ నాడు బాప్తీస్మము పొందిన క్రైస్తవులకు బోధించారు. అపొ. 2:42 "వీరు అపోస్తులుల బోధయందును, ప్రార్థనచేయుటయందును ఎడతెగక యుండిరి".

దేవుని సువార్తబోధ శక్తివంతమైనది, జీవము గలది. (రోమా 1:16; హెబ్రీ 4:12). దేవునిబోధ - క్రీస్తుబోధ - అపోస్తులుల బోధ వ్రాయబడింది, స్థిరపరచబడింది. దీనిని ఏ వ్యక్తి, సంస్థ, సమూహాము మార్చలేదు.

ఒక్కసారి అపోస్తలులు బోధించిన బోధకు ఎవడైన వ్యతిరేకంగా బోధించినచో వారిని వెలివేయమని పరిశుద్ధాత్ముడు హెచ్చరించారు. రోమా 16:17లో "సహోదరులారా, మీరు నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను, ఆటంకములను కలుగజేయు వారిని కనిపెట్టియుండుడి అని మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను, వారిలో నుండి తొలగిపోవుడి". ఇప్పుడు క్రీస్తుబోధను క్రొత్తనిబంధనగా అందించి దేవుడు ప్రజలను ఆశీర్వదించారు. (2 తిమో 3:16-17). యేసు మారడు కాబట్టి యేసుక్రీస్తుబోధ మారదు (యోహాను 12:48; మత్త 24:35; హెబ్రీ 13:8). క్రీస్తుబోధ అనగా క్రీస్తు బోధించిన సూత్రముల లోని సత్యము అని అర్థము. ఆయనకు మాత్రమే చెందిన బోధ. క్రీస్తు చెప్పిన మాటలు ఆయన బోధ అని మత్త 5-7 అధ్యాయములలోను. "నేను మీతో చెప్పునదేమనగా" అని అధికారికంగా బోధించారు. (మత్త 5:22,28,34, 39,44). ఈ బోధ దేవుడు, క్రీస్తు ప్రభువు, దీనిని సమర్థించి, స్థాపించిన బోధన క్రీస్తుబోధ అంటారు, క్రీస్తు అపోస్తులులు, క్రీస్తుకు రాయబారులు. భారతదేశ రాయబారులు, విదేశాలలో ఉండి మన భారతదేశపు అభిప్రాయములు ఎలా తెలియజేయుదురో, అపోస్తులు కూడా క్రీస్తు తరపున క్రీస్తు బోధను బోధించినవారు (2 కొరి 5: 19-21). అపోస్తులులు యెరూషలేమును క్రీస్తుబోధతో నింపియున్నారు. (అపొ 5:28). అపోస్తులడగు యోహాను, 2 యోహాను 9లో ఎవడైతే క్రీస్తుబోధను అనుసరింపడో, బోధించడో, ఆ బోధను మార్చి బోధించునో వాడు దేవుని సంబంధికాడు. ఒకే విశ్వాసమును కలిగించేదే క్రీస్తుబోధ, బేధములు మనుష్యుల బోధల ద్వారా ప్రవేశించినాయి. క్రీస్తుబోధ ద్వారా కాదు. పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగించబడినది(యూదా3) క్రీస్తు బోధించిన సువార్త దేవుని శక్తితో నిండినది. (రోమా 1:16).

**బోధకునికి హెచ్చరిక :**

బోధించువాడు దేవుని వాక్యమును మాత్రమే బోధించవలెను. 1 పేతురు 4:11లో "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్లు బోధించవలెను. ఇందువలన దేవుడు బోధలోను క్రీస్తుద్వారా మహిమపరచబడును. అని వాక్యం తెలుపుచున్నది. కాబట్టి బోధకు

లారా, క్రీస్తుబోధను నేర్చు కొనుడి, క్రీస్తుబోధను మాత్రమే బోధించండి. లేనిచో శాపముసుమా!

అనేకమైన ఇతర బోధలు లోకమందు కలవని బైబిల్లో కలదు.

**వ్యర్థమైన బోధ :**

మత్త 15:9లో యేసుప్రభువు "ఈ ప్రజలు తమ పేదవులతో నన్ను ఘనపరచుదురుగానీ వారి హృదయము నాకు దూరముగా యున్నది. మనుష్యులు కల్పించిన బోధలను దేవుని బోధలని బోధించువారు నన్ను వ్యర్థ్యంగా ఆరాధించుచున్నారని హెచ్చరించారు. కాబట్టి నేడు బైబిల్‌లో లేని వాటిని కలిపి, ఉన్నవాటిని తీసివేసి భోదిస్తున్న నేటి మతశాఖల బోధకులందరూ వ్యర్థమైనవాటిన బోధించి దేవుని బోధలని ప్రజలను నరకానికి పంపుచున్నారు. ఆ కల్పించుకున్న బోధకులుకూడా నరకానికి వెళ్ళుచున్నారు. ఇదొక క్రైస్తవత్వంలోని విషాద సంఘటన.

**బిలాము బోధ :**

ప్రకట 2:14-16లో యేసు క్రీస్తు పెర్గములోని క్రీస్తు సంఘమును హెచ్చరించిన మాటలు "నీమీద నేను కొన్ని తప్పిదములు మోపవలసి యున్నది. అవేవనగా, విగ్రహములకు బలి ఇచ్చిన వాటిని తినునట్లు ఇశ్రాయేలీయులకు ఉరియెడ్డుమని బాలాకునకు నేర్పిన బిలాము బోధను అనుసరించువారు నీయొద్ద ఉన్నారు.

**నికొలాయి బోధ :**

నికొలాయి బోధను అనుసరించు వారు నీయొద్ద ఉన్నారు. కావున మారుమనస్సు పొందుము అని హెచ్చరించారు. క్రీస్తుకు అనుసరించు వారు విగ్రహారాధికులను, అసత్యం బోధించువారి పిల్లలను పెండ్లి చేసి కొని ఇశ్రాయేలీయులవలె నశించి పోకూడదు. సంఖ్యా 31:16లో "ఇదిగో బిలాము మాటను బట్టి పెయోరు విషయములో ఇశ్రాయేలీయుల చేత యెహోవామీద తిరుగుబాటు చేయించినవారు వీరుకారా? అందుచేత యెహోవా సమాజములో తెగులు పుట్టించెను గాదా! కాబట్టి విగ్రహారాధికులను, మతశాఖల అబద్ధములనునరించు వారిని కాకుండ క్రీస్తుబోధలో వున్నవారిని, క్రీస్తునందు మాత్రమే వివాహము చేసుకొనవలెనని 1 కొరి 7:39లో హెచ్చరించబడ్డాము.

**దయ్యముల బోధ :**

అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు అత్మలయందును, దయ్యముల బోధయందును లక్ష్యముంచి, విశ్వాసభ్రష్టులగుదురని ఆత్మతేటగా చెప్పుచున్నాడు. ఆ అబద్ధికులు, వాత వేయబడిన మనస్సాక్షిగలవారై 1) వివాహమును నిషేధించుచు 2) సత్యవిషయమై అనుభవజ్ఞానము గల వాశ్వాసులు (కృతజ్ఞతా స్తుతులు చెల్లించిపుచ్చుకొను నిమిత్తము దేవుడు సృజించిన ఆహారవస్తువులను కొన్ని టిని తినుట మానవలెనని చెప్పుదురు (వీరు ఖచ్చితంగా ఆర్.సి.యమ్ స్వాములే).

**ముగింపు :**

క్రీస్తు బోధించిన బోధను గాక సొంత వ్యర్ధకల్పితబోధలు బోధించు వారి నోళ్ళు మూయించవలెను. (తీతు 1:9-11).

**క్రీస్తుబోధ :**

**1.** నమ్మి బాప్తీస్మము పొందు వాడు రక్షింపబడును. **2.** ఆత్మతో సత్యముతో దేవుని ఆరాధింపవలెను. (యోహాను 4:23,24). **3.** ప్రతి ఆదివారం ప్రభురాత్రి భోజనం తీసు కోవాలి. (అపో 20:7). 1 కొరింథీ 16:2). **4.** సంఘము అను శరీరమునకు క్రీస్తే శిరస్సు. కాబట్టి క్రీస్తు పేరే ధరించాలి. (మత్త 16:18, అపో 20:28) **5.** ఆదివారం మాత్రవే ఆరాధించాలి. శనివారం ఇశ్రాయేలీయులకు మాత్రమే (దానియే 9:9, నెహెమ్యా 9:13).

తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచుడి (ఎఫెస్సీ 6:4).

నేడు నీవు క్రీస్తుబోధను బోధించక, వినక, నడచుకొనకపోతే నీ ఆత్మ నిత్యానరకాగ్నిలో కాలిపోవును. జాగ్రత్త! క్రీస్తుబోధ నేర్చుకొనుము.

– ఓర్పు ఆదాము, నూజివీడు

---

**సత్యవాణి టి.వి కార్యక్రమములు :**

ప్రతి ఆదివారం సాయంం **6గం॥లకు శుభవార్త**

ప్రతి బుధవారం సాయంం **6:30 గంటలకు రక్షణ**

ప్రతి గురువారం మధ్యాహ్నం **2:30 గం॥లకు రక్షణ** మరియు

ప్రతి శనివారం "ప్రేమసాక్షి" టి.వి. **(తిరుపతిలో) :**

ఉదయం **7:00 గం॥లకు** చూడండి.

www. satyavani.coc. com.

# పౌలు యొక్క జీవిత చరిత్ర

## (The Life of Paul )

ఆదిమ సంఘాభివృద్ధికి కారకులైన వారిలో ముఖ్యుడు అపొస్తలుడైన పౌలు యొక్క జీవితం, బోధలు, సువార్త యాత్రలు మొదలగువాటిని గూర్చి అతడు వ్రాసిన పత్రికలలో అక్కడక్కడా మనకు కొంత లభించును. పౌలు యొక్క సహచరుడగు లూకా వ్రాసిన అపొస్తలుల కార్యములు గ్రంథములో పేతురు యొక్కయు (అపొ.కా. 1-12 అద్యా) పౌలు యొక్కయు (అపొ.కా. 13-28), జీవిత చరిత్ర కొంత మనకులభించును. పౌలు యొక్క జీవితంలో సంభవించిన కొన్ని ఘటనలు దిగువక్లుప్తముగా వివరించబడినవి. ఆయా తేదీలు బైబిలును బట్టి, చరిత్రను బట్టి ఇంచుమించుగా ఇయ్యబడినవి.

**పౌలు యొక్క ఆరంభజీవితం :**

- అతడు తార్సులో జన్మించెను (అపొ.కా. 21:39).
- యెరూషలేములో గమలియేలు నొద్ద విద్య నభ్యసించెను (అపొ.కా. 22 : 3).
- సంఘమును ఘోరముగ హింసించెను.
- స్తెఫనును రాళ్లతో కొట్టించెను (అపొ.కా. 7 : 57 - 8 : 1).
- సంఘమును హింసించుటకు అత్యాసక్తికలిగియుండెను (అపొ.కా. 8:3; 1 కొరింథీ 15:9).
- దమస్కులోని క్రైస్తవులను హింసించుటకు సంకల్పించెను (అపొ.కా. 9:1-2).

**పౌలు మార్పుజెందుట : (A.D. 36)**

అపొ.కా. 9:1-19; 22:4-16; 26:12-20. జోసిఫస్ అను యూదుల చరిత్రకారుడు అరెత అను రాజును గూర్చి వ్రాసెను. అరెత అనువాడు అరేబియాకు రాజు. అతని చేతిలో నుండి పౌలు క్రీ॥శ 39లో తప్పించుకొనెను. 2కొరింథీ 11:32లో పౌలు అరెతను గూర్చి చెబుతాడు.

**A.** క్రీ॥శ 37-39 అతడు దమస్కులోను అరేబియాలోనువుండెను (అపొ.కా. 9:17-22; 26:19-20; గలతీ 1:15-18).

**B.** క్రీ॥శ॥ 39 దమస్కు నుండి తప్పించుకొని యెరూషలేముకు మొట్టమొదటిగా వెళ్లెను (గలతీ 1:15-18; అపొ.కా. 9 : 23 - 26; 2 కోరింథీ 11 : 32 - 33).

**C.** క్రీ॥శ 39-43 (4 లేక 5 సం॥లు). అతడు తార్సులోను, కిలికియలోను, సిరియాలోను వుండెను (అపొ.కా. 9:29-30; గలతీ

1:21–24).

**D.** క్రీ॥శ 44 బర్నబాతో అంతి యొకయలోవుండెను. (అపొ.కా. 11:25–29).

**E.** క్రీ॥శ 44 యెరూషలేముకు ఆర్థిక సహాయము తీసికొని వెళ్లెను (అపొ.కా. 11:27–30; 12:25).

హేరోదు అగ్రిప్పయొక్క మరణము ( క్రీ॥శ 44):

–జోసిఫస్ చరిత్ర కారుడు హేరోదు క్రీ॥శ 44లో మరణించెనని చెప్పెను.

**A.** క్రీ॥శ 44–47 మొదటి సువార్త యాత్ర (అపొ.కా. 13:1–3).

**B.** క్రీ॥శ 48–49 అంతియొక యకు తిరిగివచ్చి చాలకాలము అక్కడ వుండుట బహుశ రెండు సంవత్సరములు అక్కడగడిపెను అపొ.కా. 14:25–28).

పౌలు యెరూషలేముకు మూడ వసారి ప్రయాణం (అది 50)

పౌలు మార్పుజెందిన 14 సంవత్సరముల తరువాత యెరూషలేముకు వెళ్లినట్లు గలతీ 2:1 చెప్పుచున్నది. అంతియొకయలో క్రైస్తవులుగా మార్పుజెందిన యూదులు లేవనెత్తిన సమస్యను పరిష్కరించుటకుగాను అతడు ప్రయాణముచేసెను. అన్యజనులలో నుండి క్రైస్తవులైనవారు సున్నతి పొందుట విషయమైన సంగతిని అపొస్తలులతోను పెద్దలతోను అతడు చర్చించెను.

**A.** క్రీ॥శ 51 – 54 రెండవ సువార్త యాత్ర (అపొ.కా. 15:36–41). క్రీ॥శ 52 – కొరింథులో యుంటూ 1 థెస్సలోనికయులకు పత్రిక వ్రాసెను (1 థెస్స 1:1; 3:6).

క్రీ॥శ 53 – కొరింథులో యుంటూ 2 థెస్సలోనికయులకు పత్రిక వ్రాసెను (2 థెస్స 1:1).

**B.** క్రీ॥శ 54–58 – మూడవ సువార్త యాత్ర (అపొ.కా. 18:22–23).

క్రీ॥శ 57 – ఎఫెసులో యుంటూ 1 కొరింథీయులకు పత్రిక వ్రాసెను (1 కొరింథీ 16:8).

క్రీ॥శ 57 మానిదోనియనుంచి 2 కొరింథీయుల పత్రిక వ్రాసెను.

క్రీ॥శ 57 శీతాకాలము కొరింథునుంచి గలతీయులకు వ్రాసెను.

క్రీ॥శ 58 వసంతకాలము కొరింథునుంచి రోమీయులకు వ్రాసెను.

**C.** క్రీ॥శ 58 యెరూషలేముకు తిరిగి వచ్చెను (అపొ.కా. 21:17–26).

క్రీ॥శ 58 దేవాలయములో పౌలు బంధింపబడెను (అపొ.కా. 21:27 –23:11).

క్రీ॥శ 58 – 60 కైసరయలో పౌలు బంధింపబడుట.

**V.** ఫేలిక్సు అధిపతిగా యుండుట క్రీ॥శ 60 లేక 61).

**A.** క్రీ॥శ 60 ఫేలిక్సు స్థానములో ఫేస్తు

అధిపతిగా చేయబడినప్పుడు పౌలు బందీగా యుండెను. ఈ సంఘటన క్రీ॥శ 60లో గాని 61లో గాని జరిగినట్లు జోసిఫస్, టేసిటస్, సుటోనియన్ అను చరిత్ర కారులు చెప్పుదురు.

**B.** క్రీ॥శ 60 రోమాకు ప్రయాణము (అపో.కా. 27:1-28-28:16).

**VI.** రోమాకు పౌలు చేరుకొనుట (క్రీ॥శ 61 లేక 62 వసంతకాలము):

ఫేస్తు అధికారములోనికి రాగానే పౌలు రోమాకు వెళ్లెను. ఈ ప్రయాణము యొక్క వివరములు అపో.కా. 27:1-28:15లో వ్రాయబడి యున్నవి.

**A.** క్రీ॥శ 61-63 రోమాలో మొదటిసారిగా బంధింపడుట (అపో.కా. 28:16-31).

1. పౌలు ఫిలెమోనుకు పత్రిక వ్రాసెను
2. కొలస్సయులకు వ్రాసెను
3. ఎఫెసీయులకు వ్రాసెను
4. ఫిలిప్పియులకు వ్రాసెను

**B.** క్రీ॥శ 63-67 రోమాలో రెండవసారి బంధింపబడిక ముందు కాలము.

క్రీ॥శ 67 తిమోతికి పౌలు మాసిదోని యనుండి పత్రిక వ్రాసెను (1 తిమోతి 1:3; 3:14-15).

క్రీ॥శ 67 ఎఫెసునుండి తీతుకు పత్రిక వ్రాసెను

క్రీ॥శ 68 రోమాలో 2వసారి బంధింపబడుట (2 తిమో 1:8, 2:8-9).

క్రీ॥శ 68 తిమోతి రోమానుండి 2వ పత్రిక వ్రాసెను.

క్రీ॥శ 68 2వ తిమోతి వ్రాసిన తరువాత, నీరోచక్రవర్తి మరణించక ముందు క్రీ॥శ 68 జూన్ 9) పౌలు యొక్క మరణము (2 తిమో 4:6).

**గమనిక :**

పౌలు రోమాలో బంధింపబడిన తరువాత లూకా తన వ్రాతలను ముగించెను. పౌలు యొక్క మరణ సంఘటనలను గూర్చి విద్యావేత్తలు తరుచు తర్కించేవారు. పౌలు బందీగృహము నుండి విడుదల పొందెనని, నాలుగైదు సంవత్సరముల మట్టుకు తన ప్రయాణములను కొనసాగించెనునది బలమైన అభిప్రాయము. తదుపరి అతడు మరల రోమాకు కొనిపోబడెను; అతడు బందీగానే బహుశా మరణించెను లేదా నీరో యొక్క ఆజ్ఞ వలన అతనికి మరణశిక్ష అమలుపరచబడెను.

– లూక్ గ్రిఫిన్ (H & H)

## ఒక రాజు బాప్తిస్మము పొందుట
## (The Baptism of a King)

అది క్రీ॥శ 49వ సంవత్సరము. ఫ్రాన్స్ దేశములో రీమ్స్ అనే పట్టణం. ఫ్రాన్స్ దేశ చక్రవర్తియగు క్లోవిస్ క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందవలెనని అతని భార్య క్లోటిల్డా పదే పదే అడుగుచు యుండేది. ఆమెయు, వారి యిద్దరు కుమారులును ఇంతకు ముందే బాప్తిస్మము పొంది యుండిరి. పూర్వకాలపు ఫ్రాంకులు (ఫ్రాన్స్ దేశవాసులు) వివిధ దేవతార్చనలు చేయువారు గనుక, క్లోవిస్ చక్రవర్తి తన ప్రజల మతాచారమునుండి మరలుటకు సముఖత చూపలేదు.

అయితే అతని తలంపులలో గొప్పమార్పు తెచ్చు సంఘటన ఒకటి జరిగెను. అతని శత్రువులగు అలెమానీయులతో యుద్ధము చేయుచుండగా క్లోవిస్ యొక్క సైన్యము యుద్ధభూమిలో ఓడిపోవుచుండిరి. అతని దేవతలకు ఎన్ని ప్రార్థనలుచేసినా, ఫలితము లేకపోయెను. తదుపరి అతడు దేవునికి దిగువ ప్రార్థన చేసెను.

"క్లోటిల్డా దేవుని కుమారుడని చెప్పు యేసు క్రీస్తుకు, నీవు విపత్తులో యున్నవారికి విజయముగొసగువాడవు ; నీవు నాశత్రువులపై నాకు విజయము నొసంగిన యెడల, నీబలశౌర్యమును నేననుభవించుటయేగాక, నా ప్రజలందరికి ప్రకటింతును నేను నీయందు విశ్వాసముంచెదను, నీనామమున బాప్తిస్మము పొందెదను".

అతని ప్రార్థన ఎట్లున్నా, యుద్ధము అతి త్వరలో అతని పక్షముగా తిరిగెను. క్లోవిస్ రాజు యొక్క సైన్యము విజయము సాధింప మొదలిడెను. మరియు అతని శత్రువులు అతనిని రాజుగా ఎంచుకొనిరి. క్లోటిల్డా ఈసందర్భాన్ని తనకనుకూలముగా మార్చుకొన యత్నించి, రాజు తనకు చేసిన వాగ్దానమును నెరవేర్చవలెనని కోరెను. బోధకుని ఒకని ఆమె రప్పించి, రాజుకు రక్షణ మార్గము నుపదేశించెను. వెంటనే అతడు బాప్తిస్మము పొందెను. మొదట్లో అతని అనుచరులను గూర్చిన భయం అంతామాయమైపోయెను. వారంతా "నిత్యసత్య దేవుని వెంబడించుటకుమేము సిద్ధపడి యున్నామని" తెలియజేసిరి.

క్రీ॥శ 496 డిశంబరు 25వ తేదీన ఫ్రాన్స్ చక్రవర్తియగు క్లోవిస్ బాప్తిస్మపు చెరువులో దిగి నీటిలో సంపూర్తిగ "పాప క్షమాపణనిమిత్తము" ముంచబడెను. అతడు పాపక్షమాపణ కొరకు నిత్యజీవిత నిరీక్షణ కొరకు ముంచబడెను. ఆరోజు అతనితో కూడ వేలాది ప్రజలు బాప్తిస్మము పొందగా అతడు అమితముగా ఆనందించెను.

\- హెర్షల్ డైయ్యర్

## ప్రభువు దినము
## (The Day of the Lord)

అపొ. పేతురు ఇట్లు వ్రాసాడు: "అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆదినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచ భూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దాని మీద నున్న కృత్యములు కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు దానిని ఆశతో అపేక్షించుచు మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగల వారైయుండవలెను. అయినను మనమాయన వాగ్దానమును బట్టి క్రొత్త ఆకాశముల కొరకును క్రొత్తభూమి కొరకును కనిపెట్టుచున్నాము. వాటి యందు నీతి నివసించును. ప్రియులారా, వీటి కొరకు మీరు కనిపెట్టువారు గనుక శాంతము గలవారై ఆయన దృష్టికి నిష్కళంకులుగాను, నిందారహితులుగాను కనబడునట్లు జాగ్రత్త పడుడి" (2 పేతురు 3:10-14).

ఈలోకము నాశనము చేయబడు కాలాంతమును గూర్చి పేతురు ఇక్కడ వివరించాడు. దొంగవలె వచ్చు ఈదినము కొరకు సిద్ధపడి యుండుటయే మన జీవిత ధ్యేయముకావాలి. ఈలోకజీవితము అశాశ్వతము గనుక క్రొత్త ఆకాశములు క్రొత్త భూమి కొరకు మనము అత్యంత ప్రాధాన్యత ఇయ్యాలి. పేతురు ఈ మాటలను రెండువేల సంవత్సరముల క్రితమే వ్రాసాడు. కొందరు అతని బోధను హేళను చేసారు (2 పేతురు 3:3-4). కొందరు నిర్లక్ష్యము చేసారు, అయితే దేవుడు తనవాగ్దానమును గూర్చి నిర్లక్ష్యము చేయువాడు కాదని పేతురు ఉద్ఘాటించాడు (2 పేతురు 3:9). ఆయన చెప్పినట్లే చేయును.

ఈనాడు అంతా గందరగోళముతో నిండి యున్నది, అంతా అనిశ్చయతే. యుద్ధములు, ఆకలి, రోగము మొదలగువాటి వలన అనేకులు శ్రమలనొందుచున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల నుండి బయట పడాలంటే క్రీస్తును, ఆయన రాజ్యమును మనం ముందు ఎంచుకోవాలి (మత్తయి 11:28-30). అనేకులుదైనందిన సాధక బాధకాలలో పట్టుబడి యున్నారు. నిజానికి వాటి ఉపశమనము క్రీస్తులో యున్నది. క్రీస్తుకు మనం

నమ్మకముగా యుంటే మనకు ఈ లోకంలోను, రాబోవులోకంలోను సుఖజీవనం వాగ్దానము చేయబడి యున్నది. పేతురు చెప్పినట్లు మనం క్రొత్త ఆకాశముల కొరకును క్రొత్తభూమి కొరకును కనిపెట్ట వలయును. ఈలోకాంతమందు అవి సంభవించును.

సిద్ధపడిన వారికి ప్రభువు దినము ఒక గొప్పదినము. గనుక మనము "మన ప్రభువైన యేసుక్రీస్తు అనుగ్రహించు కృపయందును జ్ఞానమందును అభివృద్ధిపొందవలెను. ఆయనకు ఇప్పుడును, యుగాంత దినము వరకును మహిమ కలుగునుగాక!" (2 పేతురు 3:18). అంతము వచ్చేసరికి ఎవరు అభివృద్ధి జెందుచు యుందురో వారు పరలోకమునకు సిద్ధపడి యుందురు.

– వేయిన్ బేరియర్

## బైబిలు
## (Bible)

చరిత్ర కాల నిర్ణయమును బట్టి ఆదికాండము మొదటి అధ్యాయమునుండి ప్రకటన గ్రంథము ఆఖరి అధ్యాయము వరకు 4100 సంవత్సరములాయెను. మొదటి లేఖకుడగు మోషే మొదలుకొని ఆఖరి లేఖకుడగు యోహాను వరకు 1600 సంవత్సరములు. ఇక్కడ 4000 సంవత్సరముల చరిత్రను నలువది మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో లిఖించుట జరిగినది. వీరు క్రీస్తుపూర్వము 1500 సంవత్సరముల నుండి క్రీస్తుశకము 100వ సంవత్సరము వరకు జీవించిన వారు. ఈ మనుష్యులెవరు? అని మనం అడుగ వచ్చును. వారు కాలేజీ ప్రొఫెసరులా? కాదు మహాపండితుల గృహములలో జన్మించిన వారా? కానే కాదు! గాని వారెవరు?

ఈలేఖకుల పూర్వికులు ఐగుప్తు దేశములో చాల కాలము బానిసలుగా యుండినవారే. వారు ఐగుప్తుయొక్క మండుటెండలో. కొరడాలు ఝుళిపించుచుండగా కష్టపడి చెమటోడ్చినవారే. వారు ఉల్లి, వెల్లుల్లి తినుచు సగటున మూడు మాసములు పనిచేయనవకాశము కల్గినవారు. వారి సంతతియగు ఇంచుమించు ఆరులక్షల మంది (స్త్రీలు, పిల్లలుగాక) ఎర్ర సముద్రమునుదాటి, భయం కర

మైన అరణ్యమార్గమున నలుబది సంవత్సరముల పయనించి, పై నుండి దేవుడు కురింపించిన మన్నాను తినుచు నలుబది సంవత్సరములు పయనించిరి. చివరకు వారు వాగ్దానముచేయబడిన 7000 చతురపు మైళ్లు గల చిన్న దేశములోనికి ప్రవేశించిరి. అక్కడ జీవిస్తు, జీవనముగడుపుచు తమ కథనమును వ్రాసిరి.

వారు గతాన్ని గూర్చి స్టడీ చేయుటకు గొప్ప గ్రంధాలయములు కలిగినవారు కాదు. అనుదిన వార్తలను విశ్లేషించి తమకు అందించే దైనిక వార్త పత్రికలువారికి లేవు, టెలిఫోన్లు కేబుళ్లు, టెలివిజన్లు వారికిలేవు. రేడియోలు అంతకుముందే లేవు, వారు విద్యలేని పామరులు. పెద్దగా చదువు సంస్కారములు కలిగినవారు కాదు. ఈ గ్రంధాన్ని వ్రాయుటలో వారు కలిసి పనిచేసే అవకాశం యేమీలేదు. వారందరు సర్వసాధారణమైన అంశము లను గూర్చే వ్రాసారు: ఉదా: మానవుడు, అతని ఆది, విధి, గమ్యము మొదలగు నవి. ఆనలుబదిమంది 66 పుసుక్త ములు వ్రాసన్త 4100 సంవత్సరముల చరిత్రను అందులో లిఖించిరి. వీటన్నిటిలోను స్వవిరుద్ధసంగతి యేమీలేదు. చరిత్ర విషయంలో గాని నైతికతలోని చిన్న పొరబాటు లేకుండా వారు వ్రాసారు.

ఒక అంశాన్ని గూర్చి ఇద్దరిని వ్రాయమంటే వారు కొన్ని స్వవిరుద్ధ సంగతులు తప్పక వ్రాస్తారు. అనేక సంవత్సరముల మట్టుకు ఒకడు ఏదైనావ్రాస్తే, తాను మధ్యలో మనసు మార్చుకొని, అంతకుముందు వ్రాసిన తప్పులను సవరించుటకద్దు, అయితే బైబిలు లేఖకుల విషయంలో అట్టిదేదీ జరుగలేదు. దీనిని గూర్చి మనం ఎట్లు చెప్పుకొనగలము? దానికి ఒకే ఒక్క జవాబున్నది. దేవుని మనుష్యులు దేవుని ఆత్మచేనడిపిం పబడిన వారై ఆగ్రంధమును వ్రాసిరి, గ్రంధకర్త దేవుడు, లేఖకులు దైవావేశ మానవులు.

– యన్.బి.హోర్డిమన్

# సర్వసంపూర్ణమైనది

## (All Sufficient )

దేవునితో మానవుడు జీవించదగునట్లు అతని సిద్ధపరచుటకు బైబిలు సర్వసంపూర్ణమైనది (2 తిమో 3:15-17). బైబిలు సర్వ సంపూర్ణమనుటలో మానవుడు పాపక్షమాపణ పొందుటకు, నీతిగల జీవితమును జీవించుటకు, నిత్యజీవిత సిద్ధపాటుకు కావలసినదంతా బైబిలులో యున్నదని అర్థము. మానవుడు ప్రతి సత్కార్యమును చేయుటకు అది అతని సిద్ధపరచును. దేవునితో మనకు గల సంబంధ విషయమై ఇంకా కావలసినది అందులో యేమీ లేదు గనుక దేవుని నుండి క్రొత్త బయల్పాటు యేమీ అవుసరం లేదు.

బైబిలు సర్వసంపూర్ణము గనుక ఏదైనా క్రొత్త బయల్పాటు అంటే, అది కావలసిన దాని కంటే ఎక్కువ, దోషసహితం, అనవుసరం. లేఖనములను మించి నాకు క్రొత్తగా దేవుడు బయలుపరిచాడని ఎవడు చెప్పుకొనినా అట్టి వానిని మనం శంకించవలసినదే. వాని విషయం జాగ్రత్తగ యుండాలి. దేవుని దరపున యిర్మియా ఇట్లు హెచ్చరించాడు : "సైన్యములకధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు - మీకు ప్రవచనములు ప్రకటించు ప్రవక్తల మాటలను ఆలకింపకుడి, వారు మిమ్మును భ్రమ పెట్టుదురు" (యిర్మియా 23:11). మరియు "స్వేచ్ఛగా నాలుకల నాడించుకొనుచు దేవోక్తులను ప్రకటించు ప్రవక్తలకు నేను విరోధిని, ఇదే యెహోవా వాక్కు మాయా స్వప్నములను ప్రకటించి వాటిని చెప్పుచు అబద్ధముల చేతను మాయా ప్రగల్భముల చేతను నా ప్రజలను దారి తొలగించు వారికి నేను విరోధినై యున్నాను. ఇదే యెహోవా వాక్కు" (యిర్మియా 23:32).

లేఖనములకు వేరై దేవుడు తమతో మాట్లాడుచున్నారని చెప్పుకొనేవారు నేడు కొందరున్నారు. గాని వారి ప్రగల్భాలను బైబిలు సమర్థించుటలేదు. కొన్ని ప్రశ్నలను మనం గమనించాలి. ఈక్రొత్త బయల్పాటులు బైబిలులోని సంగతులకు విరుద్ధముగా ఉంటాయి. ఎందు వలన ? క్రొత్తగా బయల్పాటు కలిగినదని చెప్పేవాని సంగతులు ఇంకొక అట్టి వానితో ఎందుకు విభేధిస్తాయి ? ఈ క్రొత్త బయల్పాటులకు దేవుడే ఆధారమైతే అవన్నీ సమన్వయము కలిగి యుండును గదా? క్రొత్త బయల్పాటులు ఎందుకు కావాలి? మనం సర్వసన్నద్ధులమై యుండగా, ఇంకా యేమి తక్కువ ? జీవముకు భక్తికి కావలసిన వన్నీ ఆయన మనకనుగ్రహిస్తే, మనకింకేమి కావాలి?

(2 పేతురు 1:3).

బైబిలు పై నిర్మింపబడని విశ్వాసము నిలువబడదు, "కాగా వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా10:17). బైబిలు సర్వ సంపూర్ణమై యున్నది. దేనినైనా బైబిలు ఆమోదించుట లేని యెడల దానిని మనం విసర్జించాలి. మనం దేవుని కొరకు మాట్లాడితే దేవుని వాక్యాన్ని మాట్లాడాలి (1 పేతురు 4:11). నీవిశ్వాసము సర్వ సంపూర్ణమైన దేవుని వాక్యమును బట్టి యున్నదా? లేక ఆధునిక అబద్ధప్రవక్తల మాటలను బట్టి యున్నదా? దేవుని వాక్యమును బట్టి యుంటే నీవు నిలబడతావు. మానవుల మాటలను బట్టి యుంటే కూలబడతావు.

- రోజర్ రష్

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004